క్లుప్తంగా

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు ప్రజలతో మాట్లాడి సమస్యల తెలుసుకున్నారు. కొన్ని వినతులను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమస్యలు పరిష్కరించడం కోసం గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వైద్య శిబిరంలో ఉచిత సేవలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీవీఎంసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి జీవీఎంసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రా హాస్పిటల్, విశాఖ ఐ హాస్పిటల్‌కు చెందిన వైద్యులతోపాటు ఈఎన్‌టీ, కార్డియాలజీ, గైనకాలజీ, సాధారణ విభాగాలకు చెందిన నిపుణులు స్థానిక ప్రజలకు వైద్య సేవలందించారు. ఈసీజీ, కళ్లు, బీపీ, సుగర్, గుండె, చర్మ సంబంధిత వ్యాధులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పి.వి.వి.ఎస్.మూర్తి, సభ్యులు వి.సాంబశివరావు, వి.వి.రమణమూర్తి, పి.వి.ఎస్.ఎన్.మూర్తి, జి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



జి.యశ్వంత్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డి కంచరపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న జి.యశ్వంత్ అనే బాలుడు 104 ఏరియా కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో తండ్రి జి.రవికుమార్ తన కుమారుడిని స్కూల్ వద్ద డ్రాప్ చేశాడు. తిరిగి సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేందుకు వెళ్లగా.. ఎంతకీ బాలుడు బయటకు రాలేదు. దీంతో తండ్రి స్కూల్‌లో ఆరా తీయగా అసలు సదరు బాలుడు ఆరోజు స్కూల్‌కి రాలేదని వారు తెలిపారు. అంతటా గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం ఫిఫ్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, వాసవీ సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ చైతన్య ఫౌండేషన్, వైశ్య స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంథి రామకృష్ణారావు వివరాలు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలో 500 మంది చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన శ్రేణులతో సమన్వయకర్త కె.కె.రాజు, మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్



కైలాసపురంలో ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర చేస్తున్న కె.కె.రాజు

- టీడీపీ, జనసేన శ్రేణులను పార్టీలోకి ఆహ్వానించిన కె.కె.రాజు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ–జనసేన పార్టీల నుంచి భారీగా చేరికలు జరిగాయి. జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్ నేతృత్వంలో 46వ వార్డు కైలాసపురానికి చెందిన టీడీపీ–జనసేన నాయకుడు బొట్టా రాజు తన అనుచరులతో కలిసి 500 మంది యువకులు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో పార్టీలో చేరిన వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వీరందరూ తమ పార్టీలో చేరడం ఎంతో ఆనందదాయకమన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత రాజకీయాల్లో ముందుకు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం వార్డులో కె.కె.రాజు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రమణ, చిన్నా, కృష్ణరావు, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశ విదేశాల్లో బ్రహ్మకుమారీస్ సేవలు



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దేశ విదేశాల్లో రాజయోగ అభ్యాస కార్యక్రమం కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సుధా తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలోని రాయల్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన నమస్కారం మన సంస్కృతి–మన సంప్రదాయం ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. మన దేశంలో 56 ఏళ్లుగా, రష్యాలో 36 ఏళ్లుగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, రాజయోగ అభ్యాసం గురించి తెలియజేస్తున్నామన్నారు. రాజయోగ అభ్యాసం నేర్పించడం ద్వారా రష్యాకు చెందిన సుమారు 2వేల మంది యువతీ యువకులు ప్రతి రోజూ సత్సంగం వంటి సంపూర్ణ సాత్వికాహారులుగా మారారని తెలిపారు. దేశవిదేశాల నుంచి వచ్చిన అతిథుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంసతరం నమస్తే ప్రాజెక్టు లోగోను ఆవిష్కరించారు. రాజయోగిని బి.కె.సుధా, బి.కె.ఐరీనా, బి.కె.విక్టోరియా, బి.కె.రూప, రైల్వే న్యూకాలనీ ఇన్‌చార్జి శశికళ, లైట్ హౌస్ అండ్ లైట్ షిప్స్, విశాఖపట్నం ముఖేష్ ఫార్మ, ఐఆర్‌ఎస్ అడిషనల్ కమిషనర్(జీఎస్టీ) ఎం.శ్రీకాంత్, జరీనా అరవింద్ గోష్, విశాఖ, విజయనగరం, అల్లూరి, మన్యం జిల్లాల నుంచి సుమారు 400 మంది బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం



వాకర్స్ క్లబ్ త్రిశతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న వెంకటరావు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు ఏహెచ్ఎన్ వెంకటరావు అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన వాకర్స్ క్లబ్ త్రిశతాబ్ది ఉత్సవాల్లో ఆయన ప్రసంగించారు. మూడు దశాబ్దాల పాటు వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సామాజిక చైతన్యం తీసుకువచ్చారన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఉత్తమ క్లబ్‌గా నిలిచిందని చెప్పారు. చంద్రమౌళి మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి సందర్శకులు, వాకర్స్‌కు అవసరమైన సదుపాయాలను అందించామన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ఇతర సభ్యుల సహకారంతో ఉత్తమ క్లబ్‌గా తీర్చిదిద్దామని చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం మాట్లాడుతూ నడక, ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం తేవడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో వాకర్స్ క్లబ్ ప్రథమ స్థానంలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ ఫిబ్రవరి సంచికను వెంకటరావు ఆవిష్కరించారు. పూర్వ అధ్యక్షులను సత్కరించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సంతోష్ కుమార్ మిమిక్రీ, ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, జిల్లా–101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, ఎ.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి



దుస్తులు అందిస్తున్న కె.కె.రాజు, రజిని

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా జ్యోతినగర్ సచివాలయంలో ఆదివారం పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులకు, సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు నూతన వస్త్రాలను కె.కె.రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిహెచ్.రజిని, ఈశ్వరరావు, కృష్ణారావు, అమర్‌రెడ్డి, నాయకులు కణితి చిరంజీవి, కల్యాణి, దిలీప్, జగదీశ్, శ్రీనురెడ్డి అచ్యుత్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్

సీతంపేట: దళిత, లౌకిక బహుజన శక్తులన్నీ కలిసి రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ పిలుపునిచ్చారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో అణగారిన కులాలపై కుట్ర జరుగుతోందని, వీరి హక్కులను కాలరాస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద వర్గాలపై దాడులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని చూస్తున్నారని, దీనిని లౌకిక శక్తులు ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో లౌకిక భావజాలం కలిగిన పార్టీలతో కలిసి పోటీచేసి బీజేపీని ఓడిస్తామన్నారు. ప్రొఫెసర్ సత్యపాల్ రిపబ్లికన్ పార్టీ అవతరణ, అంబేడ్కర్ కృషిని వివరించారు. సమావేశంలో పార్టీ దక్షిణ భారత కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.అంజయ్య, ఏపీ అధ్యక్షుడు ఎస్.డేవిడ్‌రాజు, కార్యదర్శి పిట్టా వరప్రసాద్, సీనియర్ నాయకులు మట్టా వెంకటరావు, బత్తుల గౌతంబాబు, రాజాన సరస్వతి, పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వెలమలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

సీతంపేట: రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం 5 పార్లమెంట్, 25 అసెంబ్లీ సీట్లను అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో 50 లక్షలకు పైబడి ఉన్న వెలమ సామాజిక వర్గానికి రానున్న ఎన్నికల్లో అత్యధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. వెలమ సంఘానికి విశాఖలో రెండెకరాల స్థలం కేటాయించాలని, వెలమ సామాజిక వర్గాన్ని బీసీ 'డీ' జాబితా నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు బర్ల పైడం నాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, తెంటు రామారావు, మంత్రబుడ్డి అనంతకుమార్, కరక రమణ, లగుడు శ్రీనివాస్, పి.మల్లయ్య దొర, బోదంకి రమణ, కోరిపల్లి పరశునాయుడు, మరిశర్ల కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో చతుర్వేద పారాయణం



అభయాంజనేయ స్వామి ఆలయంలో చతుర్వేద పారాయణం చేస్తున్న టీటీడీ వేద పండితులు

సీతమ్మధార: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం టీటీడీ వేద పండితులు సీతమ్మధార ఏఎస్సార్ నగర్ కొండపై గల 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో చతుర్వేద పారాయణం నిర్వహించారు. ఈ నెల 5, 6 తేదీల్లో సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. టీటీడీ సూపర్‌వైజర్ గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి పాల్గొని మాట్లాడుతూ వేదపారాయణం లోక శ్రేయస్సును కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఏఎస్ఎన్ రాజు, అర్చకుడు అనిరుథ్, భక్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్‌టౌన్ హెచ్‌సీ షణ్ముకరావు



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలనిన్నారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు హెచ్‌సీ షణ్ముకరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని వారికి సూచించారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజ కృతులు ఆలపిస్తున్న సుధారాణి



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

సీతంపేట: కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం సంగీత కళాకారులచే పంచరత్న కీర్తనలు ఆలపించారు. సాయంత్రం సంగీత సుధానిధి మండా సుధారాణి గాత్ర సంగీత కచేరి అత్యంత మనోహరంగా సాగింది. వీరు శోభిల్లు సప్తస్వర అను త్యాగరాజ స్వామి కృతి, రాగరత్నమాలికచే అను కృతులు గానం చేసి అలరించారు. కల్యాణి రాగంలో త్యాగరాజ గురుంస్మరామి సంగీత సద్భక్త శిరోమణి పల్లవితో ఆలపించిన కృతులు వీనులవిందు చేశాయి. వీరికి మావుడూరి సత్యనారాయణ శర్మ వయోలిన్‌పై, ధర్మారావు మృదంగంపై వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు డాక్టర్ జె.వి.ఎస్.ఎన్.మూర్తి, వి.ఆర్.సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు ఎస్.కృష్ణవేణి పర్యవేక్షించారు.

త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్‌లో మెడికల్ క్యాంప్



కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కె.కె.రాజు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్‌లో కాపు, తెలగ, బలిజ జన ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులు వైఎస్సార్‌సీపీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. కె.కె.రాజు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇండస్ట్రియల్ ఏరియాలో కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్‌లు పర్యటించారు. కార్యక్రమంలో 54, 57 వార్డుల కార్పొరేటర్లు సిహెచ్.రజిని, ఎం.వాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాయిత పైడిరత్నాకర్, నూకరాజు, చిరంజీవి, బాబ్జి, సుకుమార్, త్రీస్టార్స్ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



రజక సేవా సంఘం సభ్యులకు విరాళం అందిస్తున్న ఆళ్ల శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు చాకలిపేటలోని దుర్గాగణేష్ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో బల్లల పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొని సంఘ సభ్యులకు రూ.10 వేల విరాళం అందజేశారు. అనంతరం సంఘం సభ్యులు ఆళ్ల శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నవీరి మాధవ్, సెక్రటరీ షెల గణేష్, వార్డు సీనియర్ నాయకులు కంచు రమణమూర్తి, బోర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాచకొండ నరసింహశర్మ



ఏవీఎన్ కాలేజీలో వందో జన్మదినోత్సవం జరుపుకుంటున్న డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు, కవి, రచయిత, అనువాదకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ శత జన్మదినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శర్మ వేడుకల్లో పాల్గొని ఆయన్ని ఘనంగా సత్కరించారు. వందో జన్మదినోత్సవం కళాశాలలో జరిపించడం ఆనందంగా ఉందని, రాచకొండను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త, బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ వ్యక్తిత్వం మహోన్నతమైనదని, సాహిత్య రంగంలో విశేష ప్రజాదరణ పొందారని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు నరసింహ శర్మ అడుగు జాడల్లో నడుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ కిలారి గౌరీనాయుడు మాట్లాడుతూ శర్మ సేవలను కొనియాడారు. తెలుగు–ఆంగ్ల భాషలకు నరసింహ శర్మ వారధి వంటి వారని, శతాధిక ప్రసిద్ధ ఆంగ్ల కవులను తెలుగు వారికి పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు పి.వెంకటరత్నం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డి.గాయత్రి నరసింహమూర్తి, శ్రీనివాస్, అర్చన, స్వరాజ్యలక్ష్మి, పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

140 కిలోల గంజాయి పట్టివేత

- స్పెషల్ బ్రాంచ్ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు
- కారు సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



పోలీసులు సీజ్ చేసిన కారు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పాడేరు నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఏపీ39 ఎన్‌క్యూ 2485 నంబర్ గల కారులో గంజాయి తీసుకొచ్చి నగరంలోని తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో గల కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద పార్క్‌చేసి వెళ్లిపోయారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులతోపాటు ఏఎస్ఐ ఎం.గురునాథ్, హెడ్ కానిస్టేబుల్ కె.ఎస్.నాయుడు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఒక వ్యాన్ సహాయంతో ఆ కారును ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అందులో 70 ప్యాకెట్ల గంజాయి(140 కిలోలు) ఉన్నట్లు గుర్తించారు. కారును సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు గుర్తించిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి నిందితుడి అరెస్ట్



గంజాయి నిందితుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు సిబ్బందితో కలసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒడిశాకు చెందిన సుజీత్‌కుమార్ నాయక్ అనే వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 5 కేజీల గంజాయిని గుర్తించారు. ఒడిశా కొండమాల్ నుంచి విజయవాడకు విశాఖపట్నం మీదుగా రైలులో గంజాయిని తీసుకువెళ్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఎర్నిమాంబకు నవమి పూజలు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని కాన్వెంటు కూడలిలోని వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ నవమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, తదితర సిబ్బంది సౌకర్యాలను పర్యవేక్షించారు.